తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-02- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 7 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరం

- భాజపా–కాంగ్రెస్ పాలనల తేడాలపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- మోదీ పాలనకు 11 ఏళ్ల విజయగాథ ప్రజలకు వివరించండి
- తెలంగాణకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరం
- కాంగ్రెస్-భారాస పాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది
- అవినీతిపై కాంగ్రెస్, భారాసలపై తీవ్ర విమర్శలు



2లో..

## జీహెచ్‌ఎంసీ టెండర్లలో అక్రమాలు

### వెంటనే రద్దు చేయాలన్న డిమాండ్

**సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ,**

- వర్షా కాల టెండర్లలో అవకతవకలపై ఎమ్మెల్సీ కవిత ఆందోళన
- తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేస్తున్న అధికారులు
- విదేశీ సంస్థకు అనుకూలంగా నిబంధనలు రూపొందింపు
- హైదరాబాద్‌లో కేవలం రెండు షోరూమ్లే ఉన్న సంస్థకు ప్రయోజనం
- ఎంఓయూలపై కాంట్రాక్టర్లకు మానసిక ఒత్తిడి
- జోన్‌ల వారీగా టెండర్లు పిలవడంతో స్థానిక కాంట్రాక్టర్లకు నష్టం



3లో..

### తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీ రావు నియామకం

3లో..

## భారత్‌కు వస్తున్నా అంటూ ప్రభాకర్ రావు లేఖ



- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం
- అమెరికా నుంచి తిరిగి వస్తున్న ప్రభాకర్ రావు
- జూన్ 5న విచారణకు హాజరయ్యే ప్రకటన
- సుప్రీంకోర్టు ఆదేశాలతో వన్ టైమ్ ఎంట్రీ పాస్‌పోర్టు
- 14 నెలలపాటు అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్
- దర్యాప్తు బృందం విచారణకు సిద్ధం
- ప్రభాకర్ విచారణతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు
- ముందస్తు బెయిల్‌పై తదుపరి విచారణకు అవకాశం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ కేసులో కీలక నిందితుడు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్ రావు అమెరికా నుంచి భారత్‌కు తిరిగి వస్తున్నారు.

మిగతా 2లో..

## భారత నారీశక్తికి ప్రధాని మోదీ ఘన వందనం

- పహల్గాం దాడిపై ప్రధాని తీవ్ర వ్యాఖ్యలు
- ఉగ్రవాదంపై 'ఆపరేషన్ సిందూర్' ఘన విజయం
- మహిళా శక్తి సింబాలుగా సిందూరానికి ప్రాధాన్యం
- భారత సైన్యం ప్రతిఘటన పాకిస్తాన్‌కు గుణపాఠం
- నారీ శక్తి వందన్ బిల్లుతో మహిళల సాధికారత
- బీఎస్ఎఫ్ మహిళా దళం ధైర్యానికి ప్రధాని ప్రశంస
- ఎన్‌డీఏలో తొలి మహిళా కేడెట్ల శిక్షణ విజయవంతం
- భారత సంప్రదాయంలో సిందూరానికి కొత్త నిర్వచనం



2లో..

## తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం పదకొండేళ్ళు పూర్తయి పన్నెండో సంవత్సరంలో అడుగుపెడుతోందని, ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. ఏళ్లకేళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రాజకీయ పార్టీల నాయకులందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిన బూనారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో.. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు.



భారత మాజీ రాష్ట్రపతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా... జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఘనంగా ముగిసిన మిస్ వరల్డ్ -2025 పోటీలు

అపురూప వేదిక ఘట్టంగా అందాల తారల పోటీల వేదిక

విజేతలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు: సీఎం రేవంత్

2లో..




## ఫైనల్లో పంజాబ్ కింగ్స్





ఐపీఎల్‌లో ఫైవ్‌స్టార్ చాంపియన్లు (ముంబై, చెన్నై), మూడుసార్లు విజేత (కోల్‌కతా)ను చూసిన ఫ్యాన్స్ ఈ సీజన్‌లో కొత్త చాంపియన్‌ను చూడబోతున్నారు. తొలి క్వాలిఫయర్లో తేలిపోయిన పంజాబ్ కింగ్స్ రెండో క్వాలిఫయర్‌లో జూలు విదిల్చింది.

8లో..



## స్టూడెంట్ సూసైడ్ కేసులో ఇన్‌చార్జి తప్పులేదు

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు

2లో..

## విజయవంతంగా ముగిసిన కేటీఆర్ యూకే పర్యటన

- లండన్ నుంచి అమెరికా డల్లాస్ కి పయనం
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో పాల్గొననున్న కేటీఆర్




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు యూకే పర్యటన విజయవంతంగా ముగిసింది.

మిగతా 2లో..

## నేటి నుంచి అన్నిసబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

- రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం
- కృత్రిమ మేధ ఆధారిత సేవల ప్రారంభం
- ప్రథమ మరియు ద్వితీయ దశల్లో వచ్చిన సత్ఫలితాలు
- పౌరులకు అవినీతి రహిత సేవల లక్ష్యం
- చాట్‌బాట్ 'మేధ' ద్వారా సమాచారం అందుబాటులోకి
- డబుల్ రిజిస్ట్రేషన్ నివారణకు డెవలపర్ మాడ్యూల్
- పని భారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బంది నియామకం
- రోజువారీ 48 స్లాట్‌లు – అత్యవసరాలకు వాకిన్ సౌకర్యం
- ఆధార్-ఈ సంతకం ద్వారా మరింత వేగవంతమైన సేవలు





హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం తోపాటు కృత్రిమ మేధ ( ఎఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్థవంతమైన సేవలను అందించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.రాష్ట్ర వ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలుచేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మిగతా 3లో..

## సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

- తెలంగాణ తల్లినే మార్చేశారంటూ హరీశ్ రావు ఆగ్రహం
- ప్రభుత్వ చిహ్నాల్లో మార్పులపై సెటైర్లు
- రైతుల సమస్యలపై సీఎం దృష్టి లేదన్న విమర్శ
- అందాల పోటీలపై కాంగ్రెస్ నాయకులపై ఆరోపణ
- రాష్ట్ర పరువు గంగలో కలిపారంటూ తీవ్ర వ్యాఖ్యలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో సీఎం రేవంత్ రెడ్డి వైఖరి విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మార్పు మార్పు అంటూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆయన ఏకంగా తెలంగాణ తల్లినే మార్చేశాడని ఫైర్ అయ్యారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన తల్లిని మార్చేశారని, ఉద్యమంలో ఒక తల్లి.. అధికారంలోకి వచ్చాక మరో తల్లి ఉంటుందా అని ప్రశ్నించారు.



మిగతా 3లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : హొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఘనంగా ముగిసిన మిస్ వరల్డ్ -2025 పోటీలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగిన గ్రాండ్ ఫినాలేలో మిస్ థాయిలాండ్ ఓపల్ సుచాతా చుయాంగ్‌స్రి 72వ మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్నారు. సంప్రదాయం ప్రకారం, గత సంవత్సరం మిస్ వరల్డ్ విజేత గా నిలిచిన పోలాండ్‌కు చెందిన క్రిస్టినా పిస్కోవా ఆమెకు కిరీటం అలంకరించారు.భారతదేశం నలుమూలల నుంచి అతిథులకు హైదరాబాద్ అద్భుతమైన ఆతిథ్యం ఇవ్వడం తో అందాల తారల పోటీల వేదిక అపురూప ఘట్టంగా నిలిచింది.ఈ పోటీలో పాల్గొన్న అందరూ అందం తో పాటు తెలివితేటలు, మానవీయతను చాటుకోవడం లో పోటీపడ్డారు. ప్రపంచంలోని వివిధ ఖండాలకు చెందిన 108 మంది యువతులు ఈ పోటీలో పాల్గొన్నారు. మూడువారాల పాటు కొనసాగిన ఈ అందాల పోటీల సంగ్రామంలో మిస్ ఈథియోపియా రెండో స్థానం, మిస్ పోలాండ్ మూడో స్థానం, మిస్ మార్టినిక్ నాల్గో స్థానం గెలుచుకున్నారు. విజేతలందరికి హృదయపూర్వక అభినందనలు.అంతర్జాతీయ వేదికపై తమ ప్రతిభను చూపిన ప్రతి ఒక్కరు ఎంతగానో ఆకట్టుకున్నారు. అంకిత భావం, సమాజ శ్రేయస్సు కోసం వారు చేసిన కృషి ప్రశంసనీయం. ఈ కిరీటం ఒకరికి దక్కినప్పటికీ, ఈ పోటీలో పాలుపంచుకున్న అందరూ విజేతలే.మన తెలంగాణ రాష్ట్రం నినాదంతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. మన సంస్కృతి, చరిత్ర, వారసత్వం, మానవతా విలువలు, ప్రజల జీవన విధానాలను ఈ పోటీలు ప్రపంచానికి చాటి చెప్పాయి. మిస్ వరల్డ్ వేడుకలకు హాజరైన ప్రతి ఒక్కరూ మన రాష్ట్రానికి అంబాసిడర్ లాంటి వారే. వీరందరూ "తెలంగాణ జరూర్ ఆనా!" సందేశాన్ని ప్రపంచం నలుమూలలకూ తీసుకెళ్తారని సీఎం రేవంత్ ప్రశంసించారు.

# భారత నారీశక్తికి ప్రధాని మోదీ ఘన వందనం



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

పాకిస్తాన్ ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్న సూత్రధారులు భారత నారీశక్తిని సవాలు చేసి స్వయంగా వినాశనాన్ని కొనితెచ్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. పహల్గాం ఉగ్రవదాడిలో భార్యల కళ్లెదుటే భర్తలు చనిపోయారని అన్నారు. మన ఆడబిడ్డలు కన్నెర్ర చేస్తే ముష్కరులకు మూడినట్లేనని తేల్చిచెప్పారు. ఉగ్రవాదంపై పోరాటంలో దేశ చరిత్రలో 'ఆపరేషన్ సిందూర్' అత్యంత విజయవంతమైన ఆపరేషన్ అని స్పష్టంచేశారు. పహల్గాంలో ఉగ్రవాదులు కేవలం రక్తం పారించలేదని... మన సంస్కృతిపై దాడి చేశారని, మన దేశాన్ని విచ్చిన్నం చేసేందుకు కుట్రలు సాగించారని మండిపడ్డారు.

రాణి అహిల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా శనివారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 'మహిళా సశక్తి కరణ్ మహా సమ్మేళన్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మన సైనిక దళాలు పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాదుల అడ్డాలను నేలమట్టం చేశాయని అన్నారు. ముష్కరుల ఇళ్లలోకి చొరబడి మరీ అంతం చేయగలని నిరూపించినట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని పేర్కొన్నారు. మరోసారి భారత్‌పై దాడికి పాల్పడే సాహసం చేస్తే ఉగ్రవాదులు, వారి పోషకులు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.

**వీరత్వానికి ప్రతీక సిందూరం**

ఉగ్రవాదులను ప్రయోగించి దొంగచాటు యుద్ధాలు చేద్దామనుకుంటే కుదరని పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. తుపాకీ తూటాలకు ఫిరంగి గుండ్లతో బదులిస్తామని ఘాటుగా హెచ్చరించారు. మన సంప్రదాయంలో సిందూరం మహిళా శక్తికి ప్రతీక అని, రామ భక్త హనుమాన్ సైతం సిందూరం ధరిస్తారని తెలిజేశారు. ఇప్పుడు సిందూరం వీరత్వానికి, ఉగ్రవాదంపై ప్రతిఘటనకు గుర్తుగా మారిందన్నారు. మహిళల సాధికారత కోసం నారీశక్తి వందన్ అధినియం బిల్లు తీసుకొచ్చామని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో 75 మంది మహిళా ఎంపీలు ఉన్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని వివరించారు.

**ఆపరేషన్ సిందూర్‌లో మహిళలదే కీలక పాత్ర**

అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారి నేతృత్వంలో బీఎస్ఎఫ్ మహిళా దళం ప్రదర్శించిన ధైర్యసాహసాలను ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ దళం ఆపరేషన్ సిందూర్ సమయంలో జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్‌లో ఫార్వర్డ్ పోస్టులను పాకిస్తాన్ దాడుల నుంచి విజయవంతంగా కాపాడిందని వెల్లడించారు. రక్షణ శాఖలో భారతీయ మహిళల శక్తి సామర్థ్యాలు ప్రపంచం తిలకిస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మహిళా జవాన్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)లో 17 మంది తొలి బ్యాచ్ మహిళా కేడెట్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడం చరిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు.

# విజయవంతంగా ముగిసిన కేటీఆర్ యూకే పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఇంగ్లాండ్ గడ్డపై తెలంగాణ విజయగాథను అద్భుతంగా వినిపించిన కేటీఆర్, అధికారం కంటే పుట్టిన గడ్డ మీదనే తనకు మమకారం ఉంటుందని ఈ పర్యటనలో సమున్నతంగా చాటారు. ఈ నెల 27న యూకేలో అడుగుపెట్టిన కేటీఆర్ కు స్వాగతం పలకడానికి తెలంగాణ ఎన్.ఆర్.ఐలు భారీగా తరలివచ్చారు. కేటీఆర్ మాస్కులు ధరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గుండె సంబంధిత ఆపరేషన్ తరువాత కోలుకుంటున్న బీఆర్ఎస్ ఎన్.ఆర్.ఐ నాయకుడు, ఫిలిం డెవలప్ మెంట్ కార్పోరేషన్ మాజీ ఛైర్మెన్ అనిల్ ఇంటికి ఏయిర్ పోర్ట్ నుంచే నేరుగా వెళ్లి కేటీఆర్ పరామర్శించారు.మలిదశ ఉద్యమంలో దశాబ్దకాలం కాలం పాటు ఇంగ్లాండ్ గడ్డపై తెలంగాణవాదాన్ని వినిపించిన అనిల్ ను ఆప్యాయంగా పలకరించి కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానన్న సందేశాన్ని కేటీఆర్ ఇచ్చారు.

28 తేదిన బీఆర్ఎస్ ఎన్.ఆర్.ఐ కార్యవర్గం, సీనియర్ నేతలతో లండన్ లో సమావేశమైన కేటీఆర్...పార్టీ చేపడుతున్న కార్యక్రమాలతో పాటు భవిష్యత్తులో నిర్వహించాల్సిన కార్యక్రమాల పైన చర్చించారు. మలిదశ ఉద్యమకాలంలో తెలంగాణ వాదానికి ప్రతీకగా నిలిచారని ఎన్.ఆర్.ఐ (యూకే)విభాగాన్ని ప్రశంసించారు. బీఆర్ఎస్ హయాంలో 9 ఏండ్ల పాటు జరిగిన తెలంగాణ అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలిచారని మెచ్చుకున్నారు.ఇప్పుడు కాంగ్రెస్ అవినీతి, మోసాలను సోషల్ మీడియాలో బలంగా ఎత్తిచూపుతున్నారన్నారు.అక్కడి ఎన్.ఆర్.ఐ నేతలు



చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేటీఆర్, యూకేలో బీఆర్ఎస్ రజోత్సవ వేడుకలను నిర్వహించడానికి ఒప్పుకున్నారు. అదే రోజు యునైటెడ్ కింగ్ డమ్ తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమైన కేటీఆర్, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి కోసమే తాము పాటుపడుతామన్నారు. కోట్లాది మంది దశాబ్దాల స్వప్నాన్ని నిజం చేసిన తమకు తెలంగాణపై ఉండే ప్రేమ, అభిమానం మరెవరికీ ఉండవని చాటి చెప్పారు. ఇక 30 వ తారీఖున బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో ప్రధాన ఉపన్యాసం ఇచ్చిన కేటీఆర్,ఆర్థిక రంగాన్ని స్థిరమైన వృద్ధితో నడిపించడంలో ప్రపంచానికి తెలంగాణ ఎలా దిక్సూచీగా మారిందో అద్భుతంగా వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అనుసరించిన విప్లవాత్మక పంథాను సాధికారికంగా గణాంకాలతో సహా వివరించి, వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, పాలసీలపై తన అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. సంపదను సృష్టించి దాన్ని పేదలకు సమానంగా పంచడమే తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలిపిన విషయాన్ని హైలెట్ చేశారు. ఇండియాలో పెట్టుబడులు పెట్టాలని కోరిన కేటీఆర్, ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణను ఫస్ట్ ఛాయిస్ గా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో కేటీఆర్ చేసిన ప్రసంగం దేశవిదేశాల ప్రతినిధులను ఆకట్టుకుంది. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ సంస్థలకు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సేవలను అందించే పీడీఎస్ఎల్ సంస్థ నాలెడ్జ్ సెంటర్‌ను వార్విక్ యూనివర్సిటీ లో మే 31 నాడు కేటీఆర్ ప్రారంభించారు. దిగ్గజ కార్పోరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలు అందించడం మనందరికీ గర్వకారణం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలతో పూణే,చెన్నై తరువాత హైదరాబాద్ ఎలా ఆటోమోటివ్ హబ్ గా మారిందో వివరించారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు దొరకాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

ఇవాళ తన యూకే పర్యటన ముగించుకొని అమెరికాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబరాలలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు అమెరికాలోని డల్లాస్‌కి కేటీఆర్ బయలుదేరారు. మూడు రోజుల యూకే పర్యటనలో అనేకమంది ఎన్నారైలు కేటీఆర్ ని కలిశారు. ఫోటోలు తీసుకున్నారు. పార్టీకి, కేటీఆర్ నాయకత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల కోసం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు.యూకే పర్యటన సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విభాగం అద్భుతంగా పనిచేస్తుందని పార్టీ చేస్తున్న కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇక తనకు వీడ్కోలు పలికేందుకు ఏయిర్ పోర్ట్ కు భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎన్నారైలకు కేటీఆర్ థాంక్స్ చెప్పారు.

# తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ అవసరం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



దేశ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, భాజపా ప్రభుత్వానికి నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులకు వర్క్‌షాప్ నిర్వహించారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన, అంతర్జాతీయ యోగాదినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ, వ్యవసాయానికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలు, రాష్ట్రంలో అకాలవర్షాల వల్ల జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల వద్దకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనను వివరించాలని పదాధికారులకు దిశానిర్దేశం చేశారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని తెలిపారు. భారాస, కాంగ్రెస్ రెండూ కలిసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని, తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి వికేంద్రీకరణ జరిగిందని, భారాస ప్రభుత్వంలో అవినీతి కేంద్రీకృతం అయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బులు తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్తున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. భాజపా తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఏ పార్టీ కాపాడలేదని, అందుకే ప్రజలు భాజపా వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలు, భారాస అవినీతిని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు.

# భారత్‌కు వస్తున్నా అంటూ ప్రభాకర్ రావు లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు జూన్ ఐదో తేదీన విచారణకు హాజరు అవుతానని దర్యాప్తు బృందానికి సమాచారం ఇచ్చారు.

వివరాల ప్రకారం.. తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1గా ఉన్న ప్రభాకర్ రావు ఎట్టకేలకు అమెరికా నుంచి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో విచారణకు హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తిగా సహకరిస్తానంటూ సుప్రీంకోర్టుకు అండర్ టేకింగ్ లెటర్ రాసిచ్చారు. వన్ టైమ్ ఎంట్రీ పాస్‌పోర్టు తనకు అందిన వెంటనే భారత్ వస్తానని చెప్పుకొచ్చారు. దీంతో, పాస్‌పోర్టు అందిన మూడు రోజుల్లో ఆయన భారత్‌కు రావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

ఇదిలా ఉండగా.. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభాకర్ రావు దేశాన్ని వీడిన విషయం తెలిసిందే. గత 14 నెలలుగా ప్రభాకర్ రావు అమెరికాలోనే తల దాచుకున్నారు. ప్రభాకర్ భారత్‌కు వస్తున్న పనేపథ్యంలో ఆయనను విచారించేందుకు దర్యాప్తు బృందం సిద్ధమవుతోంది. ప్రభాకర్ ఉరావును విచారిస్తేనే ఫోన్ ట్యాపింగ్ కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

ఇక, అంతకుముందు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మూడు రోజుల్లో స్వదేశానికి రావాలని.. విచారణకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. ఈమేరకు అండర్ టేకింగ్ ఇవ్వాలని జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం స్పష్టం



చేసింది. ఇప్పటికిప్పుడు కఠిన చర్యలు తీసుకోవద్దని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. ముందస్తు బెయిల్ అంశంపై తదుపరి విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది

# స్టూడెంట్ సూసైడ్ కేసులో ఇన్‌చార్జి తప్పులేదు

## సుప్రీం కోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

స్టూడెంట్ ను పాఠశాల, హాస్టల్ ఇన్ చార్జి తిట్టడంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. స్టూడెంట్ ఆత్మహత్యకు ప్రేరేపించాడన్న అభియోగం కింద ఇండియన్ ఐపీసీ సెక్షన్ 306 ప్రకారం హాస్టల్ ఇన్‌ఛార్జ్ పై కేసు నమోదైంది. జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. మరో విద్యార్థి చేసిన ఫిర్యాదుతో హాస్టల్ ఇన్ చార్జి స్టూడెంట్ ను మందలించాడని కానీ అతడు ఆత్మహత్య చేసుకుంటాడని ఊహించలేదని పేర్కొంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ క్రమంలో నిందితుడిని నిర్దోషి అని తేలుస్తూ తీర్పు వెలువరించింది.

**మద్రాస్ హైకోర్టు తీర్పు కొట్టివేత..**



గతంలో ఇదే కేసులో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేసింది. విద్యార్థిని తిట్టడం ద్వారా అతడు ఆత్మహత్య చేసుకుంటాడని ఊహించలేమని చెప్పింది. విద్యార్థి సూసైడ్ చేసుకోవడానికి నిందితుడు ఎలాంటి కారణం అయ్యే అవకాశమే లేదని స్పష్టం చేసింది. నిందితుడు హాస్టల్‌లో శాంతి, క్రమశిక్షణను పరిరక్షించడానికి చేసిన పనే అని, అతడికి విద్యార్థితో వ్యక్తిగత వైరం లేదని పేర్కొంది.

# జీహెచ్ఎంసీ టెండర్లలో అక్రమాలు

## వెంటనే రద్దు చేయాలన్న డిమాండ్

### సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ,



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. జీహెచ్ ఎంసీలో మాన్ సూన్ ఎమర్జెన్సీ టీమ్స్, ఇన్ స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన ఎమర్జెన్సీ పనుల టెండర్లలో కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉన్న సంస్థలకు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. తెలంగాణకు చెందిన బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు వ్యవహరిస్తున్నారు.ఒక విదేశీ సంస్థకు చెందిన వాహనాలు మాత్రమే ఈ పనుల కోసం వినియోగించేలా నిబంధనలు రూపొందించారు ఆ సంస్థకు హైదరాబాద్ రెండు షోరూములు మాత్రమే ఉన్నాయి. ఆ షోరూమ్‌ల నిర్వాహకులు తెలంగాణకు చెందిన కాంట్రాక్టర్లతో ఎంఓయూ చేసుకునేందుకు ససేమిరా అంటున్నారు. తెలంగాణ కాంట్రాక్టర్లు కర్నాటక షోరూమ్‌ల డీలర్ల నుంచి ఎంవోయూలు తెచ్చుకున్నా వాటి ఫిజికల్ కాపీలు తక్కువ వ్యవధిలో తెచ్చి ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.

ఇప్పటి వరకు జీహెచ్ ఎంసీలోని 150 వార్డులకు వేర్వేరుగా టెండర్లు పిలిచేవారు.. ఇప్పుడు తొమ్మిది జోన్‌ల వారీగా మాత్రమే టెండర్లు పిలవడంతో తెలంగాణ కాంట్రాక్టర్లకు నష్టం వాటిల్లుతోంది. అధికారులు పేర్కొన్న స్పెసిఫికేషన్స్ కూడిన వాహనాల్లో ఒక క్యూబిక్ మీటర్ మెటీరియల్ కూడా తరలించడం సాధ్యం కాదు. గతంలో ఇందుకు వినియోగించిన వాహనాల్లో రెండు నుంచి మూడు క్యూబిక్ మీటర్ల మెటీరియల్ తరలించే వారు. అధికారులు ఒక సంస్థకు, రెండు కాంట్రాక్టు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనలు మార్చడంతో ఒక్కో ఏడాదికి రూ.5.85 కోట్ల అదనపు భారం పడుతుంది. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి.. గతంలో మాదిరిగా వార్డుల వారీగా టెండర్లు పిలిస్తే 150 మంది స్థానిక కాంట్రాక్టర్లకు ఉపాధి లభిస్తుంది. మున్సిపల్ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తన శాఖలో జరుగుతోన్న అక్రమాలపై దృష్టి సారించి వెంటనే చర్యలు చేపట్టాలి' అని డిమాండ్ చేస్తూ లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీ రావు నియామకం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీ రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నాడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాకకు చెందిన బాలాజీ రావు 2002 నుంచి దాదాపు 17 ఏళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2001 నుంచి 2005 వరకు గ్రామ సర్పంచ్ గా, 2019 నుంచి 2024 వరకు సుల్తానాబాద్ మండలం ఎంపీపీగా పనిచేశారు. తనను కార్యాలయ కార్యదర్శిగా నియమించిన నేపథ్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారికి బాలాజీ రావు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ జాగృతి పార్టీ కార్యాలయ కార్యకలాపాలపై పొన్నమనేని బాలాజీ రావు గారిని 9849090215 నెంబరులో సంప్రదించగలరు.



# సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ అధికార చిహ్నంలో ఇదే రేవంత్ రెడ్డి ఓసారి కాకతీయ తోరణాన్ని తీస్తానంటాడని.. మరోసారి చార్మినార్ బొమ్మను లేపేస్తా అంటాడని ఆయన సెటైర్లు వేశారు. అందాల పోటీలకు సీఎం రేవంత్ రెడ్డి ఐదు సార్లు అటెండ్ అయ్యాడని, అందాల భామలను చూసేందుకు టైమ్ ఉంది కానీ.. ఒక్కసారనా జిల్లాల్లో మార్కెట్ యార్డులకు వెళ్లి వడ్లు ఎందుకు కొనట్లేదని ప్రశ్నించేందుకు టైమ్ దొరకట్లేదా అని ధ్వజమెత్తారు. జనుము, జీలుగు విత్తనాలు ఎందుకు దొరకడం లేదంటూ అన్నదాతల కష్టాలను అడిగి తెలుసుకునేందుకు సమయం లేదా అని అన్నారు. ముఖ్యమంత్రికి వేరే పని ఏమి లేదంటూ ఎద్దేవా చేశారు. అందాల పోటీల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి వచ్చిన మహిళల పట్ల కాంగ్రెస్ నాయకులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. దీంతో దేశ ప్రతిష్టతో పాటు రాష్ట్ర పరువును ప్రభుత్వం గంగలో కలిపేసిందని ఆక్షేపించారు. వేధింపులకు గురైన మహిళ ఎంతలా బాధి పెడితే.. అలా పోటీలోంచి వైదొలిగిపోయి ఉంటుందని హరీశ్ రావు అన్నారు.



# నేటి నుంచి అన్నిసబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)



ఆదివారం నాడు స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రిగారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా అవినీతి రహితంగా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానం వల్ల తాము అనుకున్న విధంగానే సత్ఫలితాలు వచ్చాయని, 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు.

మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు , రెండో దశలో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మే 12 నుంచి ఇప్పటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని, స్లాట్ బుకింగ్ వల్ల మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయని తెలిపారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు, మనోభీష్టం మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని అమలుచేస్తుందన్నారు. అంతిమంగా ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ ( ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ మేధ 82476 23578 వాట్సాప్ నెంబర్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ నూతన ప్రక్రియ వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయని అంతేగాకుండా రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుందన్నారు. గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్ పై రిజిస్ట్రేషన్ ఛార్జీలు మార్కెట్ ధరలు తదితర అన్ని అంశాలపై ఈ ఎఐ చాట్‌బాట్ మేధ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

అక్రమాలకు చెక్ పెట్టేలా లే అవుట్‌లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు, పూర్తి కాని వాటి వివరాలు ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటు బిల్డర్ లేదా డవలపర్ దగ్గర వివరాలు ఉండేలా డవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్ ను త్వరలో తీసుకువస్తామని లిపారు. ఈ మ్యాడుల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయి. స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో పని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట, గండిపేట, ఇబ్రహీం పట్నం , సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయింత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చునని ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు బుక్ అవుతాయన్నారు.స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.స్లాట్ బుకింగ్‌తోపాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్ ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రయోగాత్మక అమలు చేస్తున్నామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు.

# జర్నలిస్టు జానీపాషాకు పితృవియోగం


### తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి పొంగులేటి

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ , టీడబ్ల్యూజేఎఫ్ నేత షేక్ జానీపాషాకు పితృవియోగం కలిగింది. అతని తండ్రి షేక్ అఫ్జల్ మియా అనారోగ్యంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జానీపాషా తండ్రి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొన్నారు. అఫ్జల్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ అల్లాహ్ ను ప్రార్థించినట్లు తెలిపారు. వారి కుటుంబసభ్యులకు మంత్రి పొంగులేటి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:

జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టవలసిన కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో టెలికాన్ఫిరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయా శాఖల వారీగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పురస్కరించుకొని ఉదయం 9.45 నిమిషములకు గంటలకు ప్రగతి మైదానంలో అమరవీరులకు నివాళులర్పించి, జాతీయ పతాక ఆవిష్కరణ పోలీసుల గౌరవ వందనం ఉంటుందని తెలిపారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతిభబింభించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి అన్నారు. అనంతరం ముఖ్య అతిథి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మరియు చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరావు జిల్లా ప్రజలను ఉద్దేశించి జిల్లాలో అమలు చేసిన, చేయనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై శకటాలను ప్రదర్శించబడతాయి అని తెలిపారు. అన్ని శాఖలు ఆ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఐదు నియోజకవర్గాలలో తెలంగాణ సాంప్రదయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధిపై సందేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి..**

జూన్ 3వ తేదీ నుంచి 20 వరకు గ్రామాల వారీగా చేపట్టనున్న రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ మండలంలో నిర్వహించే సదస్సులపై రెండు రోజుల ముందుగా ఆయా గ్రామాలకు సమాచారం ఇవ్వాలని, అప్లికేషన్ తో పాటు ఇవ్వాల్సిన పత్రాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సులు నిర్వహించాలని తెలిపారు. సదస్సులు నిర్వహించే చోట హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని, అప్లికేషన్ ఫారాలు ఇతర కావాల్సిన సామగ్రిని అందుబాటులో ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అప్లికేషన్ పూర్తిగా పక్కా సమాచారంతో నింపాలని తెలిపారు. ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షించాలని స్పష్టం చేశారు. భూములకు సంబంధించి వచ్చే అప్లికేషన్ వివరాలు ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి దానిలో నమోదు చేయాలని పేర్కొన్నారు. అప్లికేషన్ లు ప్రతి అంశం చక్కగా రాయాలని అప్లికేషన్ స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రిసీవ్డ్ కాఫీ అందజేయాలని, వారి కోసం ప్రత్యేకంగా సిబ్బంది నియమించి రాయించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసే సదస్సులను విజయవంతం చేయాలని సూచించారు.

# తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

### మాజీ ఎంపీ

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మహోన్నత ఉద్యమంలో అమరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలను ఈ సందర్భంగా మనమందరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కేసీఆర్, గాంధీజీ చూపిన అహింసా మార్గంలో శాంతియుత ఉద్యమాన్ని నడిపించి ప్రజల చిరకాల కోరికను నెరవేర్చారని నామ చెప్పారు. తాను 15వ లోక్‌సభలో పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన బిల్లు ప్రవేశ పెట్టడం జరిగిందని, దానికి అనుకూలంగా తానే మొట్ట మొదటి ఓటు వేశానని నామ వివరించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని, రైతుబంధు, రైతు బీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కళ్యాణలక్ష్మీ, ఆసరా పెన్షన్లు పెంపు, కేసీఆర్ కిట్టు, కంటి వెలుగు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం వంటి పథకాల ద్వారా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతగానో మేలు జరిగిందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం గురుకుల పాఠశాలలను పెద్ద సంఖ్యలో నెలకొల్పారని నామ పేర్కొన్నారు. కేసీఆర్ విజయవంతంగా అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచాయన్నారు. తెలంగాణ సమాజంలో ప్రతి వర్గానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ, అభివృద్ధికి దోహదపడే విధంగా కేసీఆర్ పాలన సాగిందని తన ప్రకటనలో నామ పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలు, బస్తీ దవాఖానాలు, ఆర్‌టీసీ ద్వారా మెరుగైన రవాణా సేవలు అందిస్తూ తెలంగాణ రాష్ట్రం కొత్త ప్రస్థానానికి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నాంది పలికిందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని కేవలం ఉత్సవంగా కాక, అమరుల త్యాగాల గొప్పతనాన్ని స్మరించుకునే పర్వదినంగా, ఉద్యమ సంకల్పాన్ని నిలబెట్టే స్ఫూర్తిదాయక రోజుగా జరుపుకోవాలని మాజీ ఎంపీ నామ బీఆర్ఎస్ శ్రేణులు,అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. యువత ఈ ఉద్యమ చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు, రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి పాలకులు బాధ్యతగా పని చేయాలని సూచించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## జూన్ 2న అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సాయంత్రం వేడుకలు నిర్వహణ....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా సాయంత్రం 4.00 గంటలకు జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నిర్వహించు వేడుకలలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2న సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాలోని ప్రతి నియోజక వర్గ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే /ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరుగుతాయని అన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో రాణి ఫంక్షన్ హాల్, వైరా నియోజకవర్గంలో మధిర రోడ్డులోని కమ్మవారి కళ్యాణ మండపం, మధిర నియోజకవర్గ పరిధిలో రిక్రియేషన్ క్లబ్, ఖమ్మం నియోజకవర్గంలో శ్రీభక్త రామదాసు కళాక్షేత్రం, పాలేరు నియోజకవర్గం పరిధిలో టి.సి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్ నందు వేడుకలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఆయా నియోజక వర్గంలో సాయంత్రం 4.00గంటలకు నిర్వహించే వేడుకల నందు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే తన సందేశాన్ని అందిస్తారని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో సాయంత్రం నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో ప్రజలు, ప్రజాప్రతి నిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.






## హనుమకొండలో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ నిర్వహణ

**ఆరోగ్యానికి తోడు పర్యావరణ సంకల్పం**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ హంటర్ రోడ్‌లో ఈ ఉదయం "ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమం కింద సైకిల్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించబడింది. కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడామంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ (మేరా యువ భారత్) సంస్థ ఆధ్వర్యంలో, ఏజే పెడల్స్, ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

మై భారత్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల సమక్షంలో ర్యాలీ ప్రారంభమై, నగర సర్క్యూట్ లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది సైక్లిస్టులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, ఆరోగ్య కార్యకర్తలు, స్థానికులు, ఎన్ఎస్ఎస్ కిట్స్ సభ్యులు, వరంగల్ విద్యార్థులు, అలాగే ట్రైసిటీ రైడర్స్ నుండి చంద్రశేఖర్, ఏజే పెడల్స్ నుండి జయంత్, అవినాష్, నిఖిలు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యపరమైన అలవాట్ల పెంపు, శారీరక దృఢత్వం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన పెంచే లక్ష్యంతో చేపట్టారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒక్కరోజైనా సైక్లింగ్ చేయాలని యువజన అధికారి అన్వేష్ చింతల పిలుపునిచ్చారు.

మై భారత్ యువతలో దేశభక్తి, ఆరోగ్యవంతమైన జీవనశైలి, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యం ఇవ్వడంలో కీలకంగా వ్యవహరిస్తోంది. సైక్లింగ్ ప్రచారంలో భాగంగా ఏజే పెడల్స్, ట్రైసిటీ రైడర్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ర్యాలీ విజయవంతంగా ముగియడంతో భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపిస్తున్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**


ఆదివారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో ఎస్.కె మొగలాబి భర్త ఉద్దండు సాహెబ్ కి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు ఆర్ రఘురామ్ రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయి వచ్చిన రూ.60000/ (అరవై వేలు) చెక్కును చింతకాని సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వారికి అందజేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమ్ముల కృష్ణా రెడ్డి, సీనియర్ నాయకులు వేపూరి సత్యం, జమ్ముల అశోక్ రెడ్డి, పంది వెంకటేశ్వర్లు, గడ్డం రామారావు, ఆదూరి సైదులు, మద్దిన్ని లచ్చన్న మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు...

## ఎస్సీ,ఎస్టీ,బీసీ సంక్షేమ సంఘాలతో సమీక్ష!

- సింగరేణి సి అండ్ ఎం.డి

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి పట్టణంలో సింగరేణి 11 ఏరియాల ఎస్సీ,ఎస్టీ,బీసీ సంక్షేమ సంఘాలతో సింగరేణి సి అండ్ ఎం.డి బలరాం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంట్రాక్టివ్ మీటింగ్ నిర్వహించారు. సత్తుపల్లి నుండి ఏరియా బీసీ కమిటీ నాయకులు, లైజనింగ్ ఆఫీసర్,వైస్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తు గురించి నిర్వహించినటువంటి ఇంట్రాక్టివ్ వీడియో కాన్ఫరెన్స్ లో సి అండ్ ఎం.డి బలరాం మాట్లాడుతూ, సింగరేణి సంస్థ మనుగడ కోసం మరియు సంస్థ స్థితిగతుల కోసం సింగరేణి సంస్థను కాపాడుకునే బాధ్యత మన అందరి పైన ఉందని తెలియజేశారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు కార్మికులందరూ సమిష్టి కృషితో పని చేయాలని సూచించారు. అదే విధంగా సింగరేణిలో వివిధ డిపార్ట్మెంట్లో ఉన్న అధికారులు సింగరేణి ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించారు. ఈ ఇంటరాక్టివ్ వీడియో కాన్ఫరెన్స్ లో సత్తుపల్లి నుండి బీసీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాట్లాడుతూ సత్తుపల్లి , కొత్తగూడెం ఏరియా ప్రస్తుత పరిస్థితుల గురించి వివరించారు. ఏరియాలో అధికారులు,ఉద్యోగులు సమిష్టి కృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిని సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో తోడ్పడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎస్సీ, ఎస్టీ,బీసీ సంక్షేమ సంఘం నాయకులు,ఏరియా బిసి అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ధార భీమయ్య,తీగల క్రాంతి కుమార్,సూర్య ప్రకాష్,భానోత్ అశోక్,మోహన్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజావాణి రద్దు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

సోమవారం రోజున (జూన్2) రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో, సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్ల దృష్ట్యా జూన్ 2న సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించుట లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఘనంగా నేలకొండపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**




ఖమ్మం జిల్లా నేలకొండపల్లి హై స్కూల్ 19992002 బ్యాచ్ లో చదువుకున్న విద్యార్థులు నిన్న పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. నాటి విద్యార్థులు వివిధ రంగాల్లో సెటిలై 23 ఏళ్ల తర్వాత మళ్ళీ కలుసుకోవడంతో వాళ్ళ ఆనందాలకు అవధులు లేకుండా పోయింది. నాడు వారికి బోధించిన ప్రధానోపాధ్యాయులు రాజు సార్ ఉపాధ్యాయులు ఝాన్సీ మేడం సీతా మేడం ఆశ మేడం ధనమూర్తి సార్ జగనాదం సార్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పసందైన వంటకాలతో సహపనికి భోజనం చేశారు.ఆటపాటలతో డాన్సులతో గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కణతాల వెంకటేశ్వర్లు బాబు ప్రియాంక లావణ్య రమేష్ నరేష్ రసూల్ నాగ దుర్గ వసంత నాగేశ్వరరావు మల్లయ్య చెక్కల శీను మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమంతరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ప్రముఖులు

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**ఖాజీపేట,తెలంగాణ ముచ్చట్లు:**



హనుమకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు దేశినేని హనుమంతరావు కన్నుమూశారు. ఆయన మృతి నేపథ్యంలో పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పుష్పాంజలులు అర్పించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రాంపూర్ చేరుకుని హనుమంతరావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య కూడా హనుమంతరావు నివాసానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాడే మోసిన ఎమ్మెల్యే కడియం

- ముగిసిన సీనియర్ నాయకులు హనుమంతరావు అంత్యక్రియలు
- అంతిమయాత్రలో భావోద్వేగంతో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీహరి, ఎంపీ కావ్య

**ఖాజీపేట,తెలంగాణ ముచ్చట్లు:**



సీనియర్ రాజకీయ నాయకుడు దేశినేని హనుమంతరావు అంత్యక్రియలు శనివారం రాంపూర్‌లో అశ్రునయనాల మధ్య ముగిసాయి. ఈ సందర్భంగా స్టేషన్ ఘనాపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరై భావోద్వేగంతో పార్థివ దేహానికి నివాళులర్పించారు.

హనుమంతరావు భౌతిక కాయానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే శ్రీహరి, అనంతరం పాడె మోసి చివరి విడిచిపోతూ కన్నీటి వీడ్కోలు పలికారు. "హనుమంతరావు నా ప్రాణ స్నేహితుడు. నా శ్రేయస్సు కోసం ఎప్పుడూ ఆలోచించే వ్యక్తి. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా తీరనిలోటు," అని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, ఎల్లప్పుడూ వారి పక్కన ఉంటానని చెప్పారు.

ఎంపీ డాక్టర్ కడియం కావ్య కూడా హనుమంతరావును తమ కుటుంబసభ్యుడిగా భావించినట్లు పేర్కొన్నారు. "ఆయన మరణం మా కుటుంబానికి తీవ్రమైన లోటు," అని ఆమె కంటతడి మడచుకోలేక తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీతో పాటు వారి కుటుంబ సభ్యులు, డాక్టర్ నజీర్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బంధన్ ఆసుపత్రి పై చర్యలేవి ?

- న్యాయం కోరుతున్న బాధితుడు
- బంధన్ ఘటనపై నిపుణుల నివేదిక కోసం ఎదురుచూపు
- నెలలు గడుస్తున్నా స్పందనలేకపోవడంపై ఆవేదన

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

బంధన్ ఆస్పత్రిలో జరిగిన వైద్య నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్న బాధితుడు కృష్ణ తనకు న్యాయం జరగాలంటూ కోరుతున్నారు. గత ఏడాది జూలై 21న అపెండిక్స్ సమస్యతో బంధన్ ఆస్పత్రిలో చేరిన ఆయన, వైద్యుల అజాగ్రత్త వల్ల పెద్దపేగు రంధ్రం కావడంతో శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ సోకి, ప్రాణాపాయ స్థితికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ బేగంపేటలోని మరో ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యుల అత్యవసర చికిత్సతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఈ ఘటనపై గత ఎనిమిది నెలలుగా బాధితుడు కృష్ణ అనేక ఆరోగ్య శాఖ అధికారులను కలసి ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగకపోవడం బాధాకరమని అన్నారు. డీఎంహెచ్‌వో, ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో బంధన్ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం జరిగిందని అంగీకరించినప్పటికీ, చర్యలు తీసుకునే అధికారం లేదని వెల్లడించారని తెలిపారు.

**నిపుణుల కమిటీ నివేదికే కీలకం**

గతేడాది డిసెంబరు 16న ఎంజీఎం ఆసుపత్రి నిపుణుల కమిటీ నివేదిక ఇవ్వాలని అధికారులు కోరినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి నివేదిక రాకపోవడంతో విచారణ నిలిచిపోయిందని కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుని ఆరోపణల మేరకు బంధన్ ఆసుపత్రికి రాజకీయ ఆశ్రయముందన్న ఊహాగానాలు ప్రజల్లో కలకలం రేపుతున్నాయి.

**ఒక్కటే విన్నపం – న్యాయం చేయండి**

ఇప్పటికైనా జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విచారణను పూర్తి చేసి తగిన చర్యలు తీసుకోవాలని, తద్వారా ఈ తరహా ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని బాధితుడు కృష్ణ కోరుతున్నారు. "సాధారణ ప్రజలకు న్యాయం అందకపోతే, ఈ వ్యవస్థ పట్ల ప్రజల విశ్వాసం కోల్పోతుంది" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్ర...
# ఒక ఆత్మగౌరవ పోరాటం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఉంది. ఈ ఉద్యమం తెలంగాణ ప్రాంత ప్రజల ఆత్మగౌరవం, సాంస్కృతిక గుర్తింపు, సామాజికఆర్థిక న్యాయం కోసం జరిగిన పోరాటంగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ, ఈ విజయం సాధించడానికి దాదాపు ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, అసంఖ్యాక త్యాగాలు, మరియు అవిశ్రాంత కృషి ఉన్నాయి.

**ప్రారంభ నేపథ్యం (1940-1950లు)**


తెలంగాణ ఉద్యమం యొక్క మూలాలు 1940లలో హైదరాబాద్ రాష్ట్రంలోని నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో కనిపిస్తాయి. నిజాం రాజు ఏడవ మహ్మద్ అలీ ఖాన్ పాలనలో, తెలంగాణ ప్రాంత రైతాంగం జాగీర్దారీ వ్యవస్థ, అధిక పన్నులు, మరియు భూస్వామ్య వివక్షత కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. 194651 మధ్య కాలంలో, కమ్యూనిస్ట్ నాయకత్వంలో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఈ అసంతృప్తికి నాంది పలికింది. ఈ పోరాటం భూసంస్కరణలు, సామాజిక న్యాయం కోసం జరిగినప్పటికీ, తెలంగాణ ప్రత్యేక గుర్తింపు కోసం ఒక ముందడుగుగా భావించబడుతుంది.

**1956: ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు మరియు అసంతృప్తి**

1956లో రాష్ట్రాల పునర్విభజన చట్టం ప్రకారం, హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతం ఆంధ్ర రాష్ట్రంతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. ఈ విలీనం తెలంగాణ ప్రజలలో అసంతృప్తిని రేకెత్తించింది. తెలంగాణ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడినట్లు, ఉద్యోగ అవకాశాలు, వనరుల పంపిణీలో నిర్లక్ష్యానికి గురైనట్లు ఆరోపణలు వచ్చాయి. జెంటిల్మెన్స్ అగ్రిమెంట్ (1956) ద్వారా తెలంగాణకు కొన్ని హామీలు ఇవ్వబడినప్పటికీ, అవి పూర్తిగా అమలు కాలేదు, ఇది ప్రజలలో మరింత అసమ్మతిని పెంచింది.

**1969లో తొలి తెలంగాణ ఉద్యమం**

1969లో తెలంగాణ ఉద్యమం ఒక నిర్ణయాత్మక దశలోకి ప్రవేశించింది. ఉద్యోగాలు, విద్యా అవకాశాలు, మరియు సమన్యాయం కోసం విద్యార్థులు, ఉద్యోగులు, మరియు రాజకీయ నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమం "జై తెలంగాణ" నినాదంతో ప్రారంభమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారింది. అయితే, ఈ ఉద్యమం పోలీసు దమనకాండకు గురై, 369 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తెలంగాణ ప్రజలలో లోతైన గాయాన్ని మిగిల్చింది.



**1990లో ఉద్యమం యొక్క పునర్జన్మ**

1990లలో తెలంగాణ ఉద్యమం మళ్లీ ఊపందుకుంది. ఈ సమయంలో సామాజిక, సాంస్కృతిక, మరియు రాజకీయ సంస్థలు తెలంగాణ గుర్తింపును పునరుద్ఘాటించాయి. 1997లో బీజేపీ నాయకుడు ఎల్.కె. అద్వానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ప్రకటించడం ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. అదే సమయంలో, సాహిత్యవేత్తలు, కళాకారులు, మరియు మేధావులు తెలంగాణ సంస్కృతిని, భాషను ఉద్ధరించే ప్రయత్నాలు చేశారు.

**2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావం**

2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్) స్థాపించడం ఉద్యమంలో ఒక కీలక మలుపు. కేసీఆర్ నాయకత్వంలో, తెలంగాణ ఉద్యమం ఒక నిర్దిష్ట రాజకీయ లక్ష్యంగా మారింది. టీఆర్ఎస్ 2004, 2009 ఎన్నికలలో గణనీయమైన స్థానాలను గెలుచుకుని, తెలంగాణ డిమాండ్‌ను జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చింది.

**2009: నిర్ణయాత్మక దశ**

2009లో కేసీఆర్ హైదరాబాద్‌లో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపిరి పోసింది. ఈ దీక్షకు విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజల నుంచి విపరీతమైన మద్దతు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనలు, బంద్‌లు, ర్యాలీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. డిసెంబర్ 9, 2009న కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే, ఆంధ్ర ప్రాంత నాయకుల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా ఈ ప్రక్రియ కొంత వెనుకబడింది.

**2011-2014 మధ్యలో సామూహిక ఉద్యమం,విజయం**

2011లో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) ఏర్పడింది, ఇది ఉద్యమాన్ని మరింత సమన్వయం చేసింది. విద్యార్థులు, ఉద్యోగులు, మరియు సామాజిక సంస్థలు "సకల జనుల సమ్మె" వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. చివరకు, 2013 జూలై 30న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. 2014 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం పార్లమెంట్‌లో ఆమోదించబడింది. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం అధికారికంగా ఏర్పడింది, కేసీఆర్ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

**తెలంగాణ ఉద్యమం యొక్క ప్రాముఖ్యత**

తెలంగాణ ఉద్యమం కేవలం రాష్ట్ర ఏర్పాటు కోసం మాత్రమే కాదు, ఇది ఒక ప్రాంతం యొక్క ఆత్మగౌరవం, సాంస్కృతిక గుర్తింపు, మరియు సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటం. ఈ ఉద్యమం భారతదేశంలో రాజకీయ ఐక్యత, సామాజిక సమానత్వం, మరియు ప్రాంతీయ అభివృద్ధి కోసం ఒక ఉదాహరణగా నిలిచింది. తెలంగాణ ప్రజల సంకల్పం, త్యాగాలు, మరియు ఐక్యత ఈ విజయాన్ని సాధ్యం చేశాయి.

**ముగింపు**

తెలంగాణ ఉద్యమం ఒక సామాన్య ప్రజా ఉద్యమం, ఇది విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మేధావులు, మరియు రాజకీయ నాయకుల ఐక్యతతో విజయవంతమైంది. ఈ ఉద్యమం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, వారి సంస్కృతిని, మరియు గుర్తింపును ప్రపంచానికి చాటింది. ఈ రోజు, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సాంస్కృతిక వైభవం, మరియు సామాజిక సమానత్వం దిశగా ముందుకు సాగుతోంది, ఈ ఉద్యమ చరిత్రను గర్వంగా గుర్తు చేసుకుంటూ.

జై తెలంగాణ!



రచయిత:
రాజేష్ బొల్లెపాక
సీనియర్ జర్నలిస్ట్
(9493669669)



# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి అధికార నివాసంలో రేవంత్ రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్న అనంతరం ఆయన ముఖ్యమంత్రితో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ సాగిస్తున్న సామాజిక న్యాయ పోరాటాన్ని ముఖ్యమంత్రి మరోసారి ప్రశంసించారు. దళితుల, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం చేస్తున్న కృషికి పద్మశ్రీ పురస్కారం రావడం గర్వకారణమని వ్యాఖ్యానించారు.

# అధైర్య పడాల్సిన అవసరం లేదు సముచిత స్థానం కల్పిస్తాం

- సింగపురం ఇందిరకు,రాష్ట్ర ఇంచార్జ్ నటరాజన్ మీనాక్షి భరోసా
- సింగపురం ఇందిరకు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నుండి పిలుపు
- మీనాక్షి నటరాజన్ ను కలిసిన సింగపురం ఇందిరా

స్టేషన్ ఘనపూర్,తెలంగాణ ముచ్చట్లు:



స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నిబద్ధతతో పనిచేస్తున్న సింగపురం ఇందిర, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆహ్వానంపై హైదరాబాద్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పట్ల నిస్వార్థంగా శ్రమిస్తున్న కార్యకర్తల గొంతుకగా ఆమె ఈ సమావేశంలో స్పష్టంగా తన అభిప్రాయాలను వినిపించారు.

గత పదేళ్లుగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, పార్టీ వితరణను కాపాడుతూ, ప్రజల్లో నమ్మకం పెంచుతూ, 30 వేల ఓట్లతో ఉన్న బలాన్ని 95 వేల ఓట్లకు చేర్చిన స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని వివరించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పునాదులను బలోపేతం చేయడంలో ఆమె పోషించిన పాత్రను వివరించడమే కాకుండా, ఎన్నికల తర్వాత జరిగిన మార్పులు-చేర్పులపై కూడా స్పష్టమైన అవగాహనతో స్పందించారు.

సమావేశానంతరం మీనాక్షి నటరాజన్, సింగపురం ఇందిర చూపిన నిబద్ధతను ప్రశంసిస్తూ, పార్టీ పట్ల పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూస్తామని, ఆమె వంటి సమర్థవంతమైన నాయకులకు పార్టీ అండగా ఉండటమే కాకుండా, రాబోయే రోజుల్లో పూర్తి మద్దతుగా నిలబడతామని హామీ ఇచ్చారు.

నియోజకవర్గ పరిస్థితులపై వ్యక్తిగతంగా ఆరా తీసి, కార్యకర్తల భావాలను పట్టించి విన్న మీనాక్షి నటరాజన్‌కు సింగపురం ఇందిర కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పట్ల అంకితభావంతో పని చేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అర్థవంతమైన ప్రతినిధిగా నిలిచే దిశగా ఆమె చేస్తున్న ప్రయాసలకు ఇది మరింత బలాన్నిస్తుంది.

# స్వరాష్ట్రాన్ని సురాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నాం



- రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క రాష్ట్ర ప్రజలకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ మార్గంలో సాగుతున్న ఈ సంతోషకర సందర్భంలో ప్రతి ఒక్కరికి తన అభినందనలు తెలియజేశారు.

స్వరాష్ట్రం సాధన కోసం జరిగిన దీర్ఘకాల ఉద్యమం, అమరవీరుల త్యాగాలను, సోనియమ్మ తెగువను ఆమె గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా సంకల్పంతో ఏర్పడిన ప్రభుత్వం, తెలంగాణ స్వరాష్ట్రాన్ని సురాష్ట్రంగా తీర్చిదిద్దే ధ్యేయంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల బాగోగులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు. స్వల్ప కాలంలోనే అనేక అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని గుర్తు చేశారు. గ్రామీణాభివృద్ధికి, మహిళల సాధికారతకు, చిన్నారుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం ఈ తరం ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాలనీ, తెలంగాణను అభివృద్ధి, సమానత, శాంతి, సౌభ్రాతృత్వాల ప్రతీకగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పని చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



# దేవరుప్పల గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్ నియామకం

జనగామ,తెలంగాణ ముచ్చట్లు:

దేవరుప్పుల గ్రామ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆకుల సంతోష్ గౌడ్‌ను ఎంపిక చేశారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న ఆధ్వర్యంలో గ్రామ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆకుల సంతోష్ గౌడ్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ యువత అభివృద్ధి కోసం నూతన అధ్యక్షుడు నిష్టతో పని చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని డిమాండ్

జనగామ,తెలంగాణ ముచ్చట్లు:

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కోరుతూ పాలకుర్తి పట్టణ పద్మశాలి సంఘం, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు, విగ్రహ ప్రతిష్టాపన కమిటీ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్ మాట్లాడుతూ - "కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమ నాయకుడు. తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమూర్తి. బహుజన వర్గాల శ్రేయస్సుకు తన జీవితాన్ని అర్పించిన నేత" అని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న, ఆయనను అధికారికంగా తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ఇటీవల బాపూజీని జాతిపితగా ప్రస్తావించినందుకు బహుజన వర్గాల తరపున కృతజ్ఞతలు తెలుపుతూ, అదే దిశగా అధికారిక ప్రకటన రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి సంఘం సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, పోపా జిల్లా సహాయ కార్యదర్శి చిదురాల ఎల్లయ్యతో పాటు పలువురు పద్మశాలి సంఘ నాయకులు - కాటబత్తిని రమేష్, చిలుకమారి సోమేశ్వర్, కామారపు సునీల్, చిదురాల ధనుంజయ్, చిలుకమారి ఉప్పలయ్య, చిలుకమారి వరప్రసాద్, పెనుగొండ వెంకటేశ్వర్లు, వైట్ల శ్రీహరి, కూరపాటి రాజు, దుస్సా శివ, తాళ్లపెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రామీణ పేదలకు అండగా హెచ్ఆర్జేఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్

◆ తొర్రూరులో ఉచిత మెగా వైద్య శిబిరం

మహబూబాబాద్,తెలంగాణ ముచ్చట్లు:




గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు హెచ్ఆర్జేఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పేర్కొన్నారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.
హనుమకొండలోని అజర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో ట్రస్ట్ ఈ శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా హనుమాండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ గ్రామీణ పేదల కోసం పనిచేస్తోందని తెలిపారు. "వర్షాకాలంలో ఉద్భవించే వ్యాధుల నివారణ, కరోనా వంటి సంక్రమణ వ్యాధుల నియంత్రణ, దీర్ఘకాలిక వ్యాధుల వైద్యం కోసం ఈ శిబిరం ఏర్పాటు చేశాం," అని పేర్కొన్నారు.
పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తొర్రూరులో ఓ ఆసుపత్రిని కూడా ట్రస్ట్ నిర్మించిందని, అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కొనసాగింపు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగుతుందని తెలిపారు.

# జర్నలిస్టు జానీపాషాకు టిడబ్ల్యూజేఎఫ్ పరామర్శ

ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:



టిడబ్ల్యూజేఎఫ్ నాయకుడు, ఆంగ్లపత్రిక రిపోర్టర్ షేక్ జానీ పాషా తండ్రి షేక్ అఫ్జల్ మియా అనారోగ్యంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా నాయకత్వం అఫ్జల్ మియాను ఆదివారం పరామర్శించారు. టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా బాధ్యులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్ లు అఫ్జల్ మియా ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను కోరారు. జానీ పాషాకు ధైర్యం చెప్పి ఓదార్చరు. జానీ పాషాకు ఫెడరేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏదైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరామర్శించిన వారిలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు వెగినాటి మాధవరావు, మానుకొండ రవి కిరణ్, ఆవుల శ్రీనివాస్, కొమిరె వెంకటేశ్వర్లు, అర్షద్ పఠాన్ తదితరులు ఉన్నారు.

# తమిళ హీరోతో రిలేషన్..

సినిమా ఇండస్ట్రీలో హీరోహీరోయిన్ల మధ్య ప్రేమలో ఉన్నారని రూమర్స్ రావడం సహజం. కలిసి సినిమా చేస్తున్న టైంలో ఇలాంటివి ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఇటీవల కాలంలో అయితే శ్రీలీల.. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో డేటింగ్ చేస్తుందని టాక్ వినిపించింది. ఇందులో నిజానిజాల సంగతి పక్కనబెడితే ఇప్పుడు మరో హీరోయిన్.. తనపై వస్తున్న గాసిప్స్ గురించి క్లారిటీ ఇచ్చేసింది. 'ఇస్మార్ట్ శంకర్'తో పాటు తెలుగులో పలు సినిమాలు చేసిన నిధి అగర్వాల్.. ప్రభాస్‌తో 'రాజాసాబ్', పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' చిత్రాల్లో నటించింది. పవన్ మూవీ.. ఈ నెల 12న థియేటర్లలోకి రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్లలో పాల్గొన్న నిధికి.. తమిళ హీరో శింబుతో రిలేషన్ అంటూ వచ్చిన రూమర్స్‌పై ప్రశ్న ఎదురైంది. దీనికి సవివరంగా క్లారిటీ ఇచ్చేసింది. 'సినిమాల్లో నటించిన హీరోయిన్ల గురించి చాలా పుకార్లు వస్తాయి. మరీ ముఖ్యంగా వారి వ్యక్తిగత జీవితం గురించి అందరూ ఎక్కువగా ఫోకస్ చేస్తారు. ఏది అనిపిస్తే అది బయటకు అనేస్తారు. ఇదంతా చాలా కామన్. ఎందుకంటే జనాలకు నిజాల కంటే రూమర్లపైనే ఎక్కువ ఇంట్రెస్ట్. అందుకే నేను వాటిని పెద్దగా పట్టించుకోను. నా గురించి ఎప్పుడూ ఏదో ఒకటి ఇలాంటివి వినిపిస్తూనే ఉంటాయి' అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది.




# 24 గంటలు రెస్టే ఉండట్లేదు..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇలియానా 'దేవదాసు' చిత్రంతో ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకున్న ఆమె టాలీవుడ్, బాలీవుడ్ స్టార్స్‌తో నటించి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉండగానే.. పెళ్లి కాకముందే ప్రెగ్నెంట్ అయింది. బేబీ బంప్‌తో దర్శనమిచ్చి అందరికీ షాకిచ్చింది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో చిట్ చాట్ చేసింది. ఇందులో భాగంగా ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇవ్వడంపై క్లారిటీ ఇచ్చింది. ''సినిమాలకు చాలా మిస్ అవుతున్నా. రైడ్ నాకు ప్రత్యేకమైన చిత్రం. నిజం చెప్పాలంటే 'రైడ్ 2' స్టార్ట్ చేసినప్పుడు నన్ను టీమ్ నటించమని అడిగింది. కానీ నాకు బిడ్డ పుట్టడంతో నా ప్రాధాన్యతలు మారిపోయాయి.
'రైడ్ 2' ప్రమోషన్స్‌లో వాణి కపూర్ ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఆమె పాత్ర ప్రత్యేకతను తీసుకువచ్చే ఉంటుందని నమ్ముతున్నా. నేను సినిమా ఇండస్ట్రీకి త్వరలోనే వస్తాను అని చెప్పుకొచ్చింది. ఇక మాతృత్వపు అనుభూతి గురించి మాట్లాడుతూ.. ''నేను ఊహించిన దానికి చాలా భిన్నంగా ఉంది.. ఈ ఫేజ్ ఇలా ఉంటుందని అస్సలు అనుకోలేదు.. నేను ఊహించిన దానికి పూర్తి భిన్నంగా ఉంది.. ప్రతీ రోజూ 24 గంటలు రెస్ట్ అన్నదే ఉండటం లేదు.. కానీ ఎంత కష్టంగా ఉన్నా కూడా నా బిడ్డ స్మైల్, స్పర్శతో అవన్నీ మాయం అవుతున్నాయి. మాతృత్వం అనేది గొప్ప ఫీలింగ్'' అని రిప్లై ఇచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# 'జటాధర' కంప్లీట్ అయ్యింది



'జటాధర'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు సుధీర్‌బాబు. ఆయన హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోనాక్షి సిన్హా కథానాయిక. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల కృష్ణ జయంతి సందర్భంగా ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి.. ఈ విషయాన్ని పంచుకుంది. ''ఇది ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్. విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యముంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి'' అని చిత్ర వర్గాలు తెలిపాయి.

# 'చౌకీదార్' నుంచి 'నాన్న' పాట రిలీజ్

నటుడు సాయి కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న సినిమా 'చౌకీదార్'. తెలుగు, కన్నడ భాషల్లో తీస్తున్న ఈ చిత్రంలో పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. డా. కల్లహల్లి చంద్ర శేఖర్ ఈ మూవీ నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ బండియప్ప దర్శకుడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు.
నాన్న గొప్పదనం చాటి చెప్పేలా గుండెను పిండేసేలా ఓ చక్కటి బాణీని అందించారు. నాన్నా అంటూ సాగే ఈ పాటను సంతోష్ వెంకీ రచించగా.. విజయ్ ప్రకాష్ ఆలపించారు. సచిన్ బస్రూర్ అందించిన బాణీ అయితే ప్రతీ ఒక్కరినీ కదిలించేలా ఉంది. తండ్రి త్యాగాల్ని, మోసే బాధ్యతల్ని, చూపించే ప్రేమను చాటేలా పాటను రచించారు. లిరికల్ వీడియో చూస్తుంటే సాయి కుమార్ తండ్రిగా మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం గ్యారంటీ అనిపిస్తుంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.






# ఓటీటీని షేక్ చేస్తున్న నాని హిట్3

నాచురల్ స్టార్ నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన సినిమా హిట్ 3. ఈ సినిమా థియేటర్లలో మే 1వ తేదీన విడుదలై మంచి విజయం సాధించింది. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే థియేటర్ లో కంటే ఈ సినిమాకు ఓటీటీలో మరింత క్రేజ్ పెరిగింది. కేవలం ఇండియాలోనే కాకుండా మరో ఏడు దేశాల్లో ఈ చిత్రం నంబర్ 1 స్థానంలో నిలిచింది. అదే విధంగా 23 దేశాల్లో ఈ చిత్రం టాప్ 10లో కొనసాగుతుండటం విశేషం.
థియేటర్లలో రూ.100 కోట్లకు పైగా వసూలు చేసిన సినిమా ఓటీటీలోనూ అదరగొడుతుండటంతో నాని అభిమానులు, మేకర్స్ పండుగ చేసుకుంటున్నారు. ఇక ఈ సినిమాలో నాని హీరోగా నటించడంతో పాటూ నిర్మాతగానూ వ్యవహరించారు. ఈ సినిమాకే కాకుండా హిట్ సిరీస్ మొత్తాన్ని నాని సొంత బ్యానర్లోనే నిర్మించాడు. హిట్ పార్ట్ 1లో విశ్వక్ సేన్ హీరోగా నటించగా, హిట్ 2లో అడవి శేషు హీరోగా నటించాడు. ఈ రెండు సినిమాలు కూడా మంచి విజయం సాధించాయి. ఇప్పుడు హిట్ 3 కూడా విజయం సాధించడంతో దర్శకుడిగా శైలేష్ కొలను హ్యాట్రిక్ కొట్టేశాడు.

# పెళ్లి కూతురి గెటప్‌లో శ్రీలీల..

'పెళ్లి సందడి' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ శ్రీ లీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ మూవీతోనే ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది ఈ భామ. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ప్రస్తుతం ఈ బ్యూటీ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సరసన , శివ కార్తికేయన్ నటిస్తున్న 'పరాశక్తి' మూవీతో పాటు బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ కొడుకు ఇబ్రహీం అలీ ఖాన్ సరసన ఓ హారర్ కామెడీ థ్రిల్లర్ సినిమాలో నటిస్తోంది.
అలాగే నిత్యం సోషల్ మీడియాలోనూ నిత్యం యాక్టీవ్‌గా ఉంటూ తన హాట్ హాట్ ఫొటోలతో కుర్రకారుకు హీట్ పుట్టిస్తోంది. అయితే, ఆమె తన ఇన్‌స్టాలో ఓ ఫోటో పెట్టి అభిమానులను అవాక్కయ్యేలా చేసింది. శ్రీ లీలకు ఆమె కుటుంబ సభ్యులు పసుపు, గంధం పెడుతున్న ఫొటోను తన స్టోరీగా పెట్టి.. కమింగ్ సూన్ అంటూ ఆమె క్యాప్షన్ ఇచ్చింది. దీంతో శ్రీ లీల ఏదైనా గుడ్ న్యూస్ చెప్పబోతుందా అని అందరూ అనుకున్నారు. కట్ చేస్తే.. శ్రీలీల ఇంట ఆమె ప్రీ-బర్త్‌డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు.
తన తల్లి కోరిక మేరకు ఈ ప్రీ-బర్త్ డే వేడుకను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. పెళ్లి కూతుర్ని చేసిన విధంగా శ్రీలీలను కూడా పసుపు స్నానాలతో అలంకరించి, ఆమెను బుట్టలో తీసుకుని వెళ్లారు. దీనికి సంబంధించిన పిక్స్ ఆమె తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్ట్ చేసింది. ఈ ఫొటోలు చూసి అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఆమె పెళ్లికి సంబంధించి ఏదైనా వార్త చెబుతుందని అనుకున్నవారికి ఈ బ్యూటీ మామూలు ట్విస్టు ఇవ్వలేదుగా అని అభిమానులు కామెంట్ చేస్తున్నారు.



# కొబ్బరి నీళ్లతో జుట్టు సమస్యలకు చెక్..?



చాలా మంది జుట్టు పొడిబారడం నుంచి ఉపశమనం పొందడానికి క్రమం తప్పకుండా కొబ్బరి నూనెను చర్మానికి రాసుకుంటారు. అయితే కొబ్బరి నూనెలోనే కాదు, దీని నీటిలో కూడా జుట్టుకు మేలు చేసే పదార్థాలు ఉన్నాయని బ్యూటీ నిపుణులు అంటున్నారు. చాలా మంది జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొబ్బరి నూనె ఉపయోగిస్తుంటారు. జుట్టు పొడిబారడం నుంచి ఉపశమనం పొందడానికి క్రమం తప్పకుండా కొబ్బరి నూనెను చర్మానికి రాసుకుంటారు. అయితే కొబ్బరి నూనెలోనే కాదు, దీని నీటిలో కూడా జుట్టుకు మేలు చేసే పదార్థాలు ఉన్నాయని బ్యూటీ నిపుణులు అంటున్నారు. ఇది జుట్టు, చర్మంపై మ్యాజిక్ లాగా పనిచేస్తుందట. మీ ముఖం మీద వృద్ధాప్య ఛాయలు లేదా మొటిమల మచ్చలు ఉంటే కొబ్బరి నీళ్లలో దూదిని ముంచి ముఖాన్ని తుడవాలి. ఇలా ఒక నెల పాటు చేస్తే, మచ్చలు పూర్తిగా మాయమవుతాయని నిపుణులు అంటున్నారు. జిడ్డు లేదా పొడి చర్మం సమస్యకు కూడా కొబ్బరి నీళ్లు భలేగా పనిచేస్తాయి. ఏ రకమైన చర్మానికైనా ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. మొటిమలు వచ్చే అవకాశం ఉన్నవారు కొబ్బరి నీళ్లలో దూదిని నానబెట్టి, అప్పుడప్పుడు దానితో ముఖం తుడుచుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. వర్షాకాలంలో చాలా మంది జుట్టు రాలడంతో బాధపడుతుంటారు. కొబ్బరి నీళ్లను కొద్దిగా వేడి చేసి, తలపై మసాజ్ చేసుకోవాలి. ఇలా చేస్తే చాలా త్వరగానే సమస్య నుంచి బయటపడతారని నిపుణులు అంటున్నారు. లేదా షాంపూ చేసిన తర్వాత కొబ్బరి నీళ్లతో జుట్టును కడిగినా ప్రయోజనం ఉంటుంది. ఇది జుట్టును మెరిసేలా చేయడమే కాకుండా, చుండ్రు సమస్యను కూడా తొలగిస్తుంది. కొబ్బరి నీళ్ళను శనగ పిండితో కలిపి ఫేస్ ప్యాక్ తయారు చేసుకోవాలి. అందులో కొంచెం తేనె కూడా కలపవచ్చు. ఈ ఫేస్ ప్యాక్ ఎండలో కాలిపోయిన చర్మాన్ని తిరిగి కాంతివంతం చేయడానికి అద్భుతంగా పనిచేస్తుంది.



# ఆరోగ్యంగా ఉన్నారని చెప్పే సంకేతాలు..

మీ శరీరం ఆరోగ్యంగా ఉందని చెప్పే సంకేతాల గురించి మీకు తెలుసా..? మన శరీరం మనకు కొన్ని సూచనలు ఇస్తుంది. వాటిని అర్థం చేసుకుంటే మనం ఎంత ఆరోగ్యంగా ఉన్నామో తెలుస్తుంది. మంచి ఆరోగ్యం కోసం మనం దేనిపై శ్రద్ధ పెట్టాలో ఈ సంకేతాలు చెబుతాయి. మీ కళ్ళు మృదువుగా ఎలాంటి మచ్చలు లేకుండా స్పష్టంగా మెరుస్తున్నాయంటే మీ శరీరంలో ఆరోగ్య సమస్యలు తక్కువని అర్థం. శరీరంలో రక్త ప్రసరణ బాగా జరిగితే అన్ని అవయవాలకు సరిపడా ఆక్సిజన్, పోషకాలు అందుతాయి. అందుకే కళ్ళు ప్రకాశవంతంగా కనిపిస్తాయి. కళ్ళు ఆరోగ్యంగా ఉంటే మీ మొత్తం ఆరోగ్యం బాగున్నట్లే లెక్క. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, అలారం లేకుండా స్వతహాగా మేల్కొనడం అనేది మంచి అలవాటు. దీని వల్ల మీ స్లీప్ సైకిల్ సక్రమంగా ఉందని తెలుస్తుంది. మంచి నిద్ర ఆరోగ్యానికి చాలా అవసరం. నిద్రలో ఇబ్బందులు లేదా అలారం మీద ఆధారపడటం వంటివి ఉంటే అవి ఆరోగ్య సమస్యలకు సూచనలు కావచ్చు. మీ చర్మం సున్నితంగా ఎలాంటి మచ్చలు లేకుండా మెరిసిపోతే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. శరీరంలో ఎక్కడైనా వాపు లేదా ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు చర్మంపై పసుపు పగుళ్లు, నల్ల మచ్చలు లేదా ఇతర గుర్తులు ఏర్పడవచ్చు. కాబట్టి చర్మం ఆరోగ్యంగా ఉంటే మీరు శారీరకంగా బాగున్నారని అనుకోవచ్చు. ప్రతిరోజూ ఉదయాన్నే మల విసర్జన సాఫీగా జరిగితే అది మీ జీర్ణవ్యవస్థ బాగా పని చేస్తుందని సంకేతం. జీర్ణ సమస్యలు లేకపోతే మీ శరీరం మీరు తిన్న ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేసుకుంటుందని అర్థం. పేగుల్లో సమస్యలు ఉంటే మల విసర్జన కష్టంగా ఉండవచ్చు, కాబట్టి ఇది సాఫీగా ఉండటం ముఖ్యం. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తన భావోద్వేగాలపై పూర్తి నియంత్రణ కలిగి ఉంటాడు. మూడ్ స్వింగ్స్ తక్కువగా ఉంటాయి. ఒత్తిడి, కోపం, చిరాకు, నిస్సహాయత వంటి ప్రతికూల భావోద్వేగాలు తగ్గినట్లయితే మీరు మానసికంగా కూడా బాగున్నారని అర్థం. మానసిక స్థితి స్థిరంగా ఉంటే శారీరక ఆరోగ్యంపై కూడా మంచి ప్రభావం పడుతుంది. ఏదైనా శారీరక ఇబ్బంది లేదా గాయం వచ్చినప్పుడు మీరు త్వరగా కోలుకుంటే అది మీ శరీరం శక్తివంతంగా ఆరోగ్యంగా ఉందని సంకేతం. గాయాలు త్వరగా తగ్గిపోవడం.. శరీరం తగిన రీతిలో స్పందించడం ఆరోగ్యానికి చిహ్నం. దీని వల్ల మీ రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉందని అర్థం. మీ శరీరం ఉల్లాసంగా, చురుకుగా ఉంటే ఎలాంటి పనులైనా సులభంగా చేయగలుగుతారు. శారీరకంగా చురుకుగా కదిలే శక్తి ఉంటే మీరు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పవచ్చు. శక్తివంతమైన శరీరం మంచి మానసిక స్థితి మీరు బాగున్నట్లు తెలియజేస్తాయి. మంచి నిద్ర అనేది ఆరోగ్యానికి అత్యంత అవసరం. రోజూ అవసరమైనంత సేపు నిద్రపోవడం ద్వారా శరీరం విశ్రాంతి పొందుతుంది. అర్ధరాత్రి వరకు నిద్రపోకపోవడం, నిద్ర పట్టకపోవడం వంటివి మానసిక లేదా శారీరక సమస్యలకు సూచనలు కావచ్చు. అందువల్ల నాణ్యమైన నిద్ర గుండె, మెదడు ఆరోగ్యానికి సహాయపడుతుంది. మీ గుండె ఆరోగ్యాన్ని కూడా ఎప్పటికప్పుడు గమనించాలి. రక్తపోటు, షుగర్ స్థాయిలను సరిగా నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. రోజు వ్యాయామం చేయడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. గుండె ఆరోగ్యం బలోపేతం అవుతుంది. వీటిని గమనించి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరం. ఈ సూచనలను పాటించడం ద్వారా మీరు మీ ఆరోగ్య స్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్య సమస్యలను తొందరగా గుర్తించి సరైన సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మీరు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించగలుగుతారు.

## ముఖంలో ఈ మార్పులు కనిపిస్తున్నాయా..?

ప్రస్తుత రోజుల్లో ఫ్యాటీ లివర్ వ్యాధి గురించి చాలా ఎక్కువగా వింటున్నాం. ఇది మొదట్లో పెద్దగా లక్షణాలు చూపించకపోయినా.. రానురాను అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా షుగర్, అధిక బరువు వంటి తీవ్రమైన సమస్యలకు ఇది కారణం కావచ్చు. అయితే కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఈ సమస్యను ప్రారంభ దశల్లో గుర్తించడం కాస్త కష్టమే. అయినప్పటికీ మన ముఖంపై కనిపించే కొన్ని ప్రత్యేక లక్షణాలను గమనించడం ద్వారా ఈ సమస్యను ముందుగానే గుర్తించే అవకాశం ఉంది. మీరు గమనించాల్సిన ముఖ్యమైన లక్షణాల్లో మొదటిది కళ్ల చుట్టూ ఏర్పడే నల్లటి వలయాలు. వీటిని తరచుగా అలసట లేదా నిద్రలేమికి సూచనలుగా భావిస్తుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో ఇది కాలేయానికి సంబంధించిన సమస్యకు కూడా ఒక సంకేతం కావచ్చు. కాలేయంపై ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం ఆ ఒత్తిడిని ఇలా ముఖం ద్వారా చూపించవచ్చు. మీ చర్మం ముఖ్యంగా కళ్ళలోని తెల్లటి భాగం పసుపు రంగులోకి మారడం గమనిస్తే అది కామెర్లు లేదా లివర్ సంబంధిత సమస్యల ప్రారంభ సూచన కావచ్చు. ఇది శరీరంలో బిలిరుబిన్ అనే పదార్థం స్థాయి అధికంగా ఉందనే సంకేతం. ఇది కాలేయం సరిగ్గా పని చేయడం లేదని తెలియజేస్తుంది. కాలేయం సమర్థంగా పనిచేయకపోతే శరీరంలోని విష పదార్థాలు పూర్తిగా బయటకు వెళ్లవు. ఫలితంగా అవి రక్తంలో కలిసిపోయి ముఖం చుట్టూ వాపుగా కనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా కళ్ళ కింద, బుగ్గల ప్రాంతంలో ఈ వాపు స్పష్టంగా కనిపించవచ్చు. రక్తంలో విష వ్యర్థాలు ఎక్కువగా ఉండటం వల్ల ముఖ చర్మం తన సహజమైన మెరుపును కోల్పోతుంది. ముఖం తెల్లగా జీవం లేనట్లుగా మారిపోవచ్చు. ఇది కాలేయం బాగా పని చేయట్లేదనే మరో సంకేతం. లివర్ పని తీరు మందగించినప్పుడు శరీరంలో విష పదార్థాలు పేరుకుపోతాయి. ఇవి ముఖంపై ప్రభావం చూపుతాయి. కాలేయానికి ఎక్కువ పని భారం పడటం వల్ల శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఇది ముఖ చర్మంపై పిగ్మెంటేషన్, మొటిమలు, వాపులు వంటి సమస్యల రూపంలో కనిపించవచ్చు. ముఖ్యంగా హార్మోన్ల నియంత్రణ సరిగా లేకపోవడం వల్ల శరీరంలో ఇతర ఆరోగ్య సమస్యలు కూడా మొదలవ్వవచ్చు.






## ఈ ఒక్క డ్రింక్ తాగండి చాలు..

పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం అనేది చాలా మందిని వేధించే సమస్య. ఇది శరీరాన్ని లావుగా చూపించడమే కాకుండా.. ఆరోగ్యానికి కూడా ప్రమాదం. అయితే ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొన్ని సహజ పదార్థాలతో కలిపి తయారు చేసిన డిటాక్స్ వాటర్ తాగితే.. ఈ సమస్యను నెమ్మదిగా తగ్గించుకోవచ్చు. ఇది జీర్ణ క్రియను మెరుగుపరచడంలో శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించడంలో చాలా సహాయపడుతుంది. ఈ ప్రత్యేకమైన డ్రిరక్ కోసం అవసరమయ్యే పదార్థాలు మన ఇంట్లో సులభంగా దొరికేవే. జీలకర్ర, వాము, సోంపు, నిమ్మరసం, గోరువెచ్చటి నీరు. ఈ పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవన్నీ కలిసి తీసుకుంటే శరీరంలో గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా చెడు కొలెస్ట్రాల్ ను కూడా తగ్గించడంలో సహాయపడతాయి. ఈ డ్రిరక్ లో ఉండే జీలకర్ర, వాము, సోంపు వంటి పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి శరీరంలో యాసిడ్ స్థాయిని సరిచేయడమే కాకుండా.. ఆహారం తేలికగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీని వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి.ఉదయం నిద్ర లేవగానే ఖాళీ కడుపుతో ఈ గోరువెచ్చటి నీటిని తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నెమ్మదిగా కరిగిపోతుంది. ముఖ్యంగా కడుపు భాగం చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడంలో ఇది సహాయపడుతుంది. దీని వల్ల బరువు తగ్గే ప్రక్రియ వేగవంతం అవుతుంది .ఈ గోరువెచ్చటి నీటిలో ఉండే సహజ పదార్థాలు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో కూడా సహాయపడతాయి. అవి కాలేయాన్ని శుభ్రపరచడంలో తోడ్పడతాయి. దీని వల్ల శరీరంలోని విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి.. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోజూ దీనిని తాగడం వల్ల శరీరం తేలికగా, చురుకుగా అనిపిస్తుంది. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో ఒక్కో టీ స్పూన్ జీలకర్ర, వాము, సోంపు వేసి నానబెట్టాలి. ఉదయాన్నే ఆ నీటిని కొద్దిగా వేడి చేసి అందులో అర నిమ్మకాయ రసం కలిపి ఖాళీ కడుపుతో తాగాలి. ఇదే విధంగా ప్రతిరోజూ తాగితే మంచి ఫలితాలను పొందవచ్చు.

# జస్ట్ పండేగా అనుకుంటే పొరబడినట్లే.. ఆ సమస్యలకు చెక్ పెట్టే పవర్‌హౌస్..



ఈ పండులో మనకు అధిక పరిమాణంలో విటమిన్ ఎ లభిస్తుంది. దీనితోపాటు బి1, బి2, బి3, సివిటమిన్లు, కాల్షియం, ఇనుము, భాస్వరం వంటి ఖనిజ లవణాలు బొప్పాయిలో సమృద్ధిగా ఉంటాయి.. బొప్పాయిలో ఫోలేట్ కూడా ఉంటుంది.. ఇది చాలా ఆరోగ్యకరమైనది. అందుకే.. దీనిని సూపర్ ఫ్రూట్ గా పేర్కొంటారు. బొప్పాయిలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దీనిని రెగ్యులర్‌గా తినడం వల్ల ఎన్నో సమస్యల నుంచి బయటపడొచ్చు.. బొప్పాయిని తినడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి.. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మంచిది.. అంతేకాకుండా.. బరువును కూడా తగ్గిస్తుంది. అందుకే.. విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే బొప్పాయిని క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు వైద్య నిపుణులు.. బొప్పాయిలోనే మనకు అధిక పరిమాణంలో విటమిన్ ఎ లభిస్తుంది. దీనితోపాటు బి1, బి2, బి3, సివిటమిన్లు, కాల్షియం, ఇనుము, భాస్వరం వంటి ఖనిజ లవణాలు బొప్పాయిలో సమృద్ధిగా ఉంటాయి.. బొప్పాయిలో ఫోలేట్ కూడా ఉంటుంది.. ఇది చాలా ఆరోగ్యకరమైనది. ఇందులో పొటాషియం.. మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇది కంటి సమస్యలను దూరం చేసి కంటిశుక్లం సమస్యను కూడా తొలగిస్తుంది. బొప్పాయిలో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. బొప్పాయిలో కైమోపాపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. దీనిలోని ప్రోటీన్లు పేగు ఆరోగ్యానికి సహాయపడతాయి.. కాబట్టి ఇది ఆరోగ్యానికి మంచిది. బొప్పాయి తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనివల్ల సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయి. దీనిలోని విటమిన్లు సీజనల్ వ్యాధుల నుండి రక్షిస్తాయి.. ముఖ్యంగా జలుబు లేదా దగ్గు రాకుండా ఉండటం నుంచి కాపాడతాయి.. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇందులో బీటా కెరోటిన్.. లైకోపీన్ ఉంటాయి. ఇది వాపు .. ఆక్సీకరణ నష్టం నుండి రక్షిస్తుంది. బొప్పాయి గుండె సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. చర్మ ఆరోగ్యానికి బొప్పాయి చాలా మంచిది. దీనిలోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. బొప్పాయి ఆరోగ్యకరమైన చర్మానికి కూడా మేలు చేస్తుంది.. ఇంకా మీరు బొప్పాయిని ఫేస్ మాస్క్‌గా కూడా ఉపయోగించవచ్చు. బొప్పాయి తినడం ద్వారా మీరు సులభంగా బరువు తగ్గవచ్చు. ఎందుకంటే ఇందులో ఫైబర్ ఉంటుంది. కాబట్టి కడుపు నిండిన భావన ఎక్కువగా ఉంటుంది.. దీంతో అతిగా తినరు. ఇందులో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. దీని వల్ల మీరు సులభంగా బరువు తగ్గవచ్చు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# ఫైనల్లో పంజాబ్ కింగ్స్



ఐపీఎల్‌లో ఫైవ్‌స్టార్ చాంపియన్లు (ముంబై, చెన్నై), మూడుసార్లు విజేత (కోల్‌కతా)ను చూసిన ఫ్యాన్స్ ఈ సీజన్‌లో కొత్త చాంపియన్‌ను చూడబోతున్నారు. తొలి క్వాలిఫయర్లో తేలిపోయిన పంజాబ్ కింగ్స్ రెండో క్వాలిఫయర్‌లో జూలు విదిల్చింది. 11 ఏళ్ల తర్వాత (2014) ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేరింది. ఆదివారం శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఇంటికి పంపింది. రేపు జరిగే ఫైనల్లో బెంగళూరు, పంజాబ్ తొలి ఐపీఎల్ టైటిల్ కోసం తలపడతాయి.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఠాకూర్ తిలక్ వర్మ (29 బంతుల్లో 44; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37; 7 ఫోర్లు) దంచేశారు. అజ్మ తుల్లా ఒమర్జాయ్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసి గెలిచింది. నాయకుడు శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 87 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) జట్టు గెలిచేదాకా నడిపించాడు. నేహల్ వధేరా (29 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.

**గెలిపించిన అయ్యర్**

పంజాబ్‌కు అంతపెద్ద లక్ష్యం ఛేదించడానికి అవసరమైన శుభారంభం దక్కలేదు. మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ (6), కాసేపటికే ప్రియాన్ష్ ఆర్య (10 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుకు చుక్కెదురైంది. దీంతో పవర్‌ప్లేలోనే ఓపెనర్ల వికెట్లను కోల్పోయిన 64/2 స్కోరు చేసింది. ఇన్‌గ్లిస్ (21 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసే ఆటను పాండ్యా అడ్డుకున్నాడు. దీంతో 72 పరుగులకే టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నేహల్ వాధేరా జట్టు స్కోరును వంద దాటించారు.

12 ఓవర్లలో 109/3 స్కోరు చేసిన పంజాబ్... విజయానికి 48 బంతుల్లో 95 పరుగులు కష్టమనిపించింది. టాప్లీ 13వ ఓవర్లో అయ్యర్ కొట్టిన వరుస 3 సిక్స్‌లు, ఆ వెంటనే బౌల్ట్ బౌలింగ్‌లో వాధేరా కొట్టిన బౌండరీలతో ఈ రెండు ఓవర్లలోనే 33 పరుగులు సాధించడంతో కింగ్స్ రేసులో పడింది. నాలుగో వికెట్‌కు 84 పరుగులు జోడించాక వాధేర అవుటయ్యాడు. శశాంక్ (2) రనౌటైనా... 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న అయ్యర్ భారీ సిక్స్‌లతో కింగ్స్‌ను గెలిపించాడు.

**దంచేసిన తిలక్, సూర్య**

రోహిత్ (8), బెయిర్‌స్టో (38)ల తర్వాత తిలక్, సూర్యకుమార్ అడపాదడపా మెరుపులతో జట్టు స్కోరు 10 ఓవర్లలో 100 పరుగులు దాటింది. ఈ జోడీ నిలబడి దూకుడు పెంచడంతో పరుగులు వేగంగా వచ్చాయి. చహల్ ఓవర్లో సిక్సర్ బాదిన సూర్యకుమార్... జేమీసన్ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టాడు. ఇదే జోరుతో 4, 6 కొట్టిన అతన్ని చహల్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లోనే తిలక్‌ను జేమీసన్ పెవిలియన్ చేర్చాడు. అయితే నమన్ ధీర్ ధనాధన్ బౌండరీలతో ఓవర్‌కు సగటున 10 రన్‌రేట్‌తో ముంబై స్కోరు దూసుకెళ్లింది. ఆఖరి ఓవర్లో నమన్ అవుట్ కాగా జట్టు 200 మార్క్ దాటింది.

**స్కోరు వివరాలు**


ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) వైశాక్ (బి) స్టొయినిస్ 8; బెయిర్‌స్టో (సి) ఇన్‌గ్లిస్ (బి) వైశాక్ 38; తిలక్ వర్మ (సి) ప్రియాన్ష్ (బి) జేమీసన్ 44; సూర్యకుమార్ (సి) వధేరా (బి) చహల్ 44; హార్దిక్ పాండ్యా (సి) ఇన్‌గ్లిస్ (బి) అజ్మతుల్లా 15; నమన్ (సి) స్టొయినిస్ (బి) అజ్మతుల్లా 37; రాజ్ (నాటౌట్) 8; సాంట్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 203. వికెట్ల పతనం: 1-19, 2-70, 3-142, 4-142, 5-180, 6-197. బౌలింగ్: అర్షదీప్ సింగ్ 4-0-44-0, జేమీసన్ 4-0-30-1, స్టొయినిస్ 1-0-14-1, అజ్మతుల్లా 4-0-43-2, వైశాక్ 3-0-30-1, చహల్ 4-0-39-1.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) హార్దిక్ (బి) అశ్వని 20; ప్రభ్‌సిమ్రన్ (సి) టాప్లీ (బి) బౌల్ట్ 6; ఇన్‌గ్లిస్ (సి) బెయిర్‌స్టో (బి) హార్దిక్ 38; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 87; వధేరా (సి) సాంట్నర్ (బి) అశ్వని 48; శశాంక్ (రనౌట్) 2; స్టొయినిస్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (19 ఓవర్లలో 5 వికెట్లకు) 207. వికెట్ల పతనం: 1-13, 2-55, 3-72, 4-156, 5-173. బౌలింగ్: బౌల్ట్ 4-0-38-1, టాప్లీ 3-0-40-0, బుమ్రా 4-0-40-0, అశ్వని 4-0-55-2, సాంట్నర్ 2-0-15-0, పాండ్యా 2-0-19-1.





# ప్రపంచ రెండో ర్యాంకర్ నకమురాపై అర్జున్ గెలుపు




నార్వే చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అద్భుత విజయం అందుకున్నాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో అర్జున్ అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో గెలుపొందాడు. వీరిద్దరి మధ్య జరిగిన క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 76 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహించారు. ఈ గేమ్‌లో అర్జున్ 48 ఎత్తుల్లో నకమురాపై విజయం సాధించాడు.

మరోవైపు ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఐదో రౌండ్ గేమ్‌లో 56 ఎత్తుల్లో వె యి (చైనా) చేతిలో ఓడిపోయాడు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చైనా గ్రాండ్‌మాస్టర్ లె టింగ్‌జీపై అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో 38 ఎత్తుల్లో గెలిచింది. అంతకు ముందు వీరిద్దరి మధ్య క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. భారత మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి 35 ఎత్తుల్లో స్పెయిన్‌కు చెందిన సారా ఖాడెమ్‌ను ఓడించింది.

# పౌలోనికి షాకిచ్చిన స్విటోలిన





ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ పోలండ్ అమ్మాయి.. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 16, 63, 75తో ఎలీనా రిబాకినా (కజకిస్థాన్)ను ఓడించింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో స్వియాటెక్ తొలి సెట్‌ను ఓడినప్పటికీ తర్వాత అద్భుతంగా పుంజుకుని వరుస సెట్‌లతో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది.

క్వార్టర్స్‌లో ఆమె ఎలిన స్విటోలిన (ఉక్రెయిన్)తో తలపడనుంది. మరో పోరులో 13వ సీడ్ స్విటోలిన.. 46, 76 (8/6), 61తో నిరుటి రన్నరప్ జాస్మిన్ పవులోని (ఇటలీ)కి షాకిచ్చింది. ఒకటో సీడ్ సబలెంక.. 75, 63తో అమండ (యూఎస్)పై అలవోక విజయంతో క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్స్‌లో ఆమె.. చైనా సంచలనం కిన్వెన్ జెంగ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

**బోపన్న, బాంబ్రీ జోడీల ఓటమి**

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న/ఆడమ్ పవ్లసెక్ (చెక్) ద్వయం.. 26, 67 (5/7)తో హెన్రీ పాటెన్ (యూకే)/హ్యారీ హెలియోవర (ఫిన్‌లాండ్) చేతిలో ఓడిపోయి మూడో రౌండ్‌కే ఇంటిబాట పట్టింది. మరో మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)/రాబర్ట్ (యూఎస్) జోడీ.. 46, 46తో ఎవాన్ కింగ్/క్రిస్టియన్ హ్యారీసన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడారు.

## సెంచరీల మోత మోగిస్తున్న విండీస్

మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఇవాళ (జూన్ 1) జరుగుతున్న రెండో వన్డేలో విండీస్ వన్‌డౌన్ ఆటగాడు కీసీ కార్టీ సూపర్ సెంచరీతో మెరిశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్.. కార్టీ 105 బంతుల్లో 13 ఫోర్ల సాయంతో 103 పరుగులు చేయడంతో 47.4 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. కార్టీతో పాటు ఓపెనర్ బ్రాండన్ కింగ్ (67 బంతుల్లో 59; 10 ఫోర్లు), నాలుగో నంబర్ ఆటగాడు షాయ్ హోప్ (66 బంతుల్లో 78; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు.



# స్పానిష్ గ్రాండ్‌ప్రిలో విజేతగా మెక్‌లారెన్

క్వాలిఫయింగ్ సెషన్‌లో కనబరిచిన దూకుడును ప్రధాన రేసులోనూ కొనసాగిస్తూ... మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో ఐదో విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం జరిగిన స్పానిష్‌గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజేతగా అవతరించాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన పియాస్ట్రి ఆద్యంతం ఆధిపత్యం చలాయించాడు. నిర్ణీత 66 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 32 నిమిషాల 57.375 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.

ఈ సీజన్‌లో పియాస్ట్రి చైనా గ్రాండ్‌ప్రి, బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి, సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి, మయామి గ్రాండ్‌ప్రిలలో విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని పొందగా... ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఐదో స్థానంలో నిలిచినా... చివరి ల్యాప్‌లో జార్జి రసెల్ కారును ఢీకొట్టినందుకు అతనిపై 10 సెకన్ల పెనాల్టీని విధించారు. దాంతో వెర్‌స్టాపెన్ చివరకు పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

మరోవైపు ఆస్టన్ మార్టిన్ జట్టు డ్రైవర్ లాన్స్ స్ట్రోల్ చేతిలో నొప్పి కారణంగా రేసులో పాల్గొనలేదు. మెర్సిడెస్ డ్రైవర్ కిమి ఆంటోనెలి 53వ ల్యాప్‌లో, అలెగ్జాండర్ ఆల్బోన్ (విలియమ్స్) 27వ ల్యాప్‌లో వైదొలిగారు. 24 రేసుల ఈ సీజన్‌లో 9 రేసులు ముగిశాయి. 186 పాయింట్లతో పియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 176 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 137 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రి జూన్ 15న మాంట్రియల్‌లో జరుగుతుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in